పాఠశాలకు నీటి ట్యాంక్‌, క్రీడా సామగ్రి వితరణ



నీటి ట్యాంక్‌, క్రీడా పరికారాలను అందజేస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలంటే ప్రభుత్వానికి చిన్న చూపని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఉదయ్‌కిరణ్‌ వెన్నల ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నీటి ట్యాంక్‌, క్రీడా పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన ఉదయ్‌కిరణ్‌ ఫౌండేషన్‌ నిర్వాహకులను కార్పొరేటర్‌ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవితారెడ్డి, ఫౌండేషన్‌ నిర్వాహకులు ఉదయ్‌కిరణ్‌, శ్రీకాంత్‌, నరేందర్‌, డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు నాంపల్లి రామేశ్వర్‌, నాంపల్లి శంకరయ్య, జగన్‌ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ విడుదల చేస్తున్న డీఎస్పీ రమేష్‌

మలక్‌పేట: మలక్‌పేట నెహ్రూ మెమోరియల్‌ హైస్కూల్లో సోమవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్‌ బ్యూరో, హైదరాబాద్‌ సిటీపోలీస్‌, మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రాచకొండ వింగ్‌ డీఎస్పీ రమేష్‌, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్‌, రామ్‌ప్రసాద్‌, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్‌ పిడమర్తి నరేష్‌ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జరిగే నష్టాలపై అవగాహన కల్పించే వీడియో ప్రదర్శన చూపించారు. డ్రగ్స్‌ని గుర్తించడంలో డాగ్‌స్కిల్స్‌ను ప్రదర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. స్మోకింగ్‌, ఆల్కాహాల్‌, గంజాయి, కొకైన్‌ లాంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

మంద కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సైదాబాద్‌: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని యాకత్‌పురా ఇన్‌చార్జి ఆర్‌.శరత్‌కుమార్‌ అన్నారు. మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఆయన నాయకులు మోహన్‌కృష్ణ, ప్రదీప్‌, రమేష్‌తో కలిసి మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతా

ఎల్‌బీనగర్‌: చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్‌ పరిధిలోని పలు కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిశీలించి చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. చెత్తను తొలగించడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేటర్‌ వెంట జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎస్‌ అజీమ్‌ ఉద్దీన్‌, జవాన్‌ యాదయ్య, ఎస్‌ఎఫ్‌ఏ చంద్రశేఖర్‌ ఉన్నారు.



చెత్త కుప్పలను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

రవితేజ మృతదేహం త్వరగా తీసుకొచ్చేలా కృషిచేస్తా



రవితేజ తండ్రి చంద్రమౌళిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దిల్‌సుఖ్‌నగర్‌: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన రవితేజ మృతదేహం త్వరగా నగరానికి తీసుకువచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆర్‌కే పురం గ్రీన్‌హిల్స్‌ కాలనీలోని రవితేజ తల్లిదండ్రులను సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్‌తో మాట్లాడి అమెరికాలో ఉన్న అతడి పరిచయాలతో రవితేజ మృతదేహాన్ని తొందరగా తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే వెంట అరవింద్‌ శర్మ, నగేష్‌, శ్రీనివాస్‌ రెడ్డి, గొడుగు శ్రీనివాస్‌ ముదిరాజ్‌, పెంబర్తి శ్రీనివాస్‌, మహేందర్‌ రెడ్డి, సాజిద్‌, నవీన్‌, రమేష్‌ ఉన్నారు.

బధిరుల పాఠశాలకు టీవీ, హెల్త్‌కిట్ల పంపిణీ



టీవీ, హెల్త్‌ కిట్లు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

మలక్‌పేట: ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు సగౌర చారిటబుల్‌ సొసైటీ చేయూతనిచ్చారు. సోమవారం మలక్‌పేట పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్మార్ట్‌ టీవీ, స్పోర్ట్స్‌ డ్రెస్‌, బ్యాగులు, హెల్త్‌కిట్లు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్‌ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు కలిసి వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశ్‌, రావి పాపన్న, అనురాధారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి, టీచర్లు పరిమళ దేవీ, సంగీత, పీఆర్‌టీయూ టీఎస్‌ నేతలు మందడి వెంకట్‌రెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

గాలిపటం ఎగరేస్తూ..

కాలుజారి కిందపడి బాలుడి మృతి



మృతి చెందిన మణిదీప్‌

నాగోలు: భవనంపై గాలిపటం ఎగరవేస్తూ కాలు జారి కిందపడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదాద్రి- భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్రిగూడెం గ్రామానికి చెందిన బర్ల బాలకృష్ణ–మమత కుమారుడు మణిదీప్‌(10) నాలుగో తరగతి చదువుతున్నాడు. మమత తన కుమారుడితో కలిసి సంక్రాంతి సెలవులకు నాగోలు డివిజన్‌లోని దివ్యాంగుల కాలనీలో ఉంటున్న తండ్రి బాలయ్య దగ్గరికి వచ్చారు. అప్పటికే బాలయ్య దగ్గర అతని పెద్ద కుతురు కుమారుడు జశ్వంత్‌ ఉన్నాడు. గత రెండు రోజులుగా మణిదీప్‌, జశ్వంత్‌ బాలయ్య వాచ్‌మేన్‌గా పనిచేసే లక్ష్మీ నరసింహస్వామి కాలనీలోని ఐదంతస్తుల మేడపైకి ఎక్కి గాలిపటాలు ఎగరవేస్తున్నారు. ఈ నెల 19న గాలిపటం ఎగురవేస్తూ మణిదీప్‌ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందాడు.

బడిపై మమకారం.. వసతులు సాకారం

- దాతల సహకారంతో మెరుగైన వసతులు
- కార్పొరేట్‌కు దీటుగా చంపాపేట ప్రాథమిక పాఠశాల



చంపాపేట ఆదర్శ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

చంపాపేట: సాయం చేయాలన్న ఆలోచన.. అండగా నిలవాలన్న తపన ఉంటే ఎలాంటి ఇబ్బందులైన సునాయసంగా తొలగిపోతాయి. బిల్లు..బెల్‌ అనే విధానానికి స్వస్తి పలికి అభివృద్ధికి మూలమైన విద్యావ్యవస్థకు చేదోడు వాదోడుగా ఉండాలన్న ఆశయం, ఉపాధ్యాయులలో చిత్తశుద్ధి మెండుగా ఉంటే ప్రజల సహకారంతో పాఠశాలను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతూ చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాట వేయవచ్చని చంపాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరూపిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో..

చంపాపేట చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని వెళ్లగానే తరగతి గదులపై చూడచక్కని పాఠ్యాంశాలకు సంబంధించిన రంగురంగుల పెయింటింగ్స్‌, ప్రహరీ వెంట పచ్చని చెట్లు, విశాలమైన తరగతి గదులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాష్‌రూమ్స్‌, వర్షపునీటిని శుద్ధిచేసే ప్రత్యేక ప్లాంట్‌, కంప్యూటర్‌ ల్యాబ్‌, రెండు ఐఎఫ్‌పీ స్మార్ట్‌ ప్యానెల్‌ బోర్డ్‌ ద్వారా విద్యా బోధన, ప్రీప్రైమరీ చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, బ్రేక్‌ ఫాస్ట్‌ వంటి పలు అంశాలు దర్శనమిస్తాయి. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఎవ్వరూ పట్టించుకోరు. కానీ చంపాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏ చిన్న సమస్య ఎదురైనా వెంటనే స్పందించే ఉపాధ్యాయులు కాలనీ వాసులు, స్థానిక డివిజన్‌ నాయకుల సహకారంతో సమస్యను వెంటనే పరిష్కరిస్తారు.



పాఠశాలలో డిజిటల్‌ క్లాస్‌రూం

దాతలు సమకూర్చిన సౌకర్యాలు..

- **నల్లా రఘుమారెడ్డి:** రూ. లక్ష విలువైన స్టాఫ్‌రూం ఫర్నీచర్‌, బోరు మోటరు. కంప్యూటర్‌, వాష్‌ రూంల వరకు బోరునీటి పైప్‌లైన్‌, ఓవర్‌హెడ్‌ వాటర్‌ ట్యాంక్‌, ప్రతీ విద్యా సంవత్సరంలో చిన్నారులకు నోట్‌ బుక్స్‌, పెన్నులు, స్కూల్‌ బ్యాగ్‌లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.
- **సాయి యాద్రాద్రి, నిర్మాన్‌ స్వచ్ఛంద సేవా సంస్థ:** నలుగురు విద్యా వలంటీర్లతోతో విద్యాబోధన.
- **మైక్రోసాఫ్ట్‌, బాలాజీనగర్‌ లైన్స్‌ క్లబ్‌:** కంప్యూటర్లు, తరగతి గదుల ఫర్నీచర్‌ ఏర్పాటు.
- **చంపాపేట ఆర్యవైశ్య సంఘం, రూమ్‌ రీడ్‌ స్వచ్ఛంద సంస్థ, మిద్దెల జితేందర్‌:** మైక్‌ సెట్‌ కంప్యూటర్‌ టేబుల్స్‌, ప్రతీ క్లాస్‌రూంకు వైట్‌ మార్కర్‌ బోర్డులు, సీలింగ్‌ ఫ్యాన్‌లు, 200 పుస్తకాలతో కూడిన లైబ్రరీ ఏర్పాటు.
- **ఉపాధ్యాయురాలు అజిత:** రూ. లక్ష సొంత డబ్బుతో స్మార్ట్‌ ప్రొజెక్టర్‌, వైట్‌ స్క్రీన్‌, వైఫై సదుపాయాలతో ప్రత్యేక డిజిటల్‌ క్లాస్‌రూమ్‌ ఏర్పాటు చేయించారు.
- **ఓరుగంటి కృష్ణవేణి:** 400 మంది విద్యార్థులకు బ్రేక్‌ ఫాస్ట్‌ వంటి పలు సదుపాయాలను కల్పిస్తున్నారు. కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా నిలుపుతున్న ఉపాధ్యాయుల కృషిని ప్రజలు అభినందిస్తున్నారు.

అందరి సహకారాంతోనే..



దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, తల్లిదండ్రుల సహకారంతోనే పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నాం. జిల్లాలోనే మెదటి సారిగా నాలుగు సంవత్సరాల క్రితమే ఆంగ్ల మాధ్యమంలో ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించాం. రూ. 30 లక్షలతో మా ఊరు..మన బడి పథకం ద్వారా అదనపు గదులు, వాటర్‌ సంప్‌, బాత్రూమ్స్‌ ఏర్పాటు చేయించాం. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో వలంటీర్లతో మెరుగైన విద్యా బోధన సాగిస్తున్నాం.

–మంచిరెడ్డి అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

డిజిటల్‌ క్లాస్‌రూం ఏర్పాటు చేశాం..



మారుతున్న కాలాలకు అనుగుణంగా చిన్నారులకు విద్యా బోధన సాగించాలనే ఉద్దేశంతోనే సొంత డబ్బు రూ.లక్ష ఖర్చులతో స్మార్ట్‌ ప్రొజెక్టర్‌, సౌండ్‌ బాక్సులు, వైఫై సౌకర్యాలతో డిజిటల్‌ క్లాస్‌రూం ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అత్యవసర అవసరాలు ఉంటే ఉపాధ్యాయులు అందరం చర్చించుకుని మా ఖర్చుతోనే అవసరాలు తీరుస్తున్నాం. పెద్ద మొత్తంలో ఖర్చులు ఉంటే దాతలను ఆశ్రయిస్తే వెంటనే స్పందిస్తున్నారు.

–కె. అజిత, ఉపాధ్యాయురాలు

సమస్య చెప్పగానే స్పందిస్తున్నారు..



పాఠశాలలో సమస్య ఉందని తెలిపిన వెంటనే ఆయా సంస్థలు, దాతలు వెంటనే స్పందిస్తున్నారు. వారి సహకారంతోనే పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రాజెక్ట్‌ పద్ధతి ద్వారా పాఠ్యాంశాలను చేయించి ప్రత్యక్ష భాగస్వాములుగా చేయటంతో మెరుగైన ఫలితాలు ఉంటాయనే ఉద్దేశంతో ఆ దిశలో బోధన సాగిస్తున్నాం. 2023లో జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాల, ఉత్తమ ప్రధానోపాధ్యాయుడుగా మంచిరెడ్డి అనంతరెడ్డి స్థానం దక్కించుకున్నారు.

–డి. వినయ్‌కుమార్‌, ఉపాధ్యాయుడు

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

లింగోజిగూడ: ఫీజు కట్టలేదని బైరామల్‌గూడలోని ఓ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను బయట నిలబెట్టారని తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసనకు దిగారు. ఇప్పటికే 80 శాతం ఫీజులు చెల్లించామని రూ.7 వేలు మాత్రమే చెల్లించాల్సి ఉందని దానికే తమ పిల్లలను బయట నిలబెట్టారని పాఠశాల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌ రెడ్డి పాఠశాలకు వెళ్లి విషయం తెలుసుకునేందుకు యత్నింగా నిర్లక్ష్యంగా మాట్లాడడంతో రాజశేఖర్‌రెడ్డి అనుచరులు, పాఠశాల సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కార్పొరేటర్‌ ఫిర్యాదు మేరకు సదరు పాఠశాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ట్రేడ్‌ లైసెన్స్‌ రిన్యూవల్‌ చేయించుకోవాలని నోటీసులు జారీ చేశారు. 2022 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ 14,48,304 పెండింగ్‌లో ఉందని వెంటనే చెల్లించి రిన్యూవల్‌ చేయించుకోవాలని సూచించారు. నిరసనలో శశిధర్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్‌, పల్సం శ్రీధర్‌గౌడ్‌, జూపల్లి ప్రవీన్‌కుమార్‌, ప్రవీణ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గౌస్‌ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 5 ఫిర్యాదులు

ఎల్‌బీనగర్‌: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్‌ మూడు సర్కిల్‌ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో హయత్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలో 3, ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ పరిధిలో 1, సరూర్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలో 1 ఫిర్యాదు వచ్చినట్లు డీసీలు పేర్కొన్నారు.

చాదర్‌ఘాట్‌: ప్రజావాణిలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు వచ్చామని డిప్యూటీ కమిషనర్‌ జయంత్‌ తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేటలోని మూసీ ప్రాంతంలో, అజంపురాలో మరొక ఫిర్యాదు వచ్చాయన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మలక్‌పేట: మూసారంబాగ్‌ డివిజన్‌ బాలదానమ్మబస్తీ కమ్యూనిటీహాల్లో సోమవారం పి. అర్పిత్‌రాజ్‌, ఎడ్వర్డ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత శిబిరానికి స్పందన వచ్చింది. హ్యాండ్‌ ఆఫ్‌ హోప్‌ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పసుల ఓఫీర్‌రాజు వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పసుల ఏసుదాసు, సరోజిని, డాక్టర్లు రాగచందన, అన్వేష్‌, సహస్ర, నాయకులు యిర్మియా, ధన్వంత్‌, సతీష్‌, పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి



కోట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సైదాబాద్‌: మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ వైస్‌ చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం నిర్వహించిన దిల్‌సుఖ్‌నగర్‌ మున్నూరు కాపుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశంలో ఆయన పాల్గొని కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఘం నాయకులు నిత్యం ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. మున్నూరు కాపుల్లో రాజకీయ చైతన్యం కలిగేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

సైదాబాద్‌: దివ్యాంగులు మానసిక దృఢత్వంతో ముందుకు సాగాలని ఐఎస్‌సదన్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డివిజన్‌ పరిధి సుబ్రహ్మణ్యనగర్‌ కాలనీ కమ్యూనిటీ హాల్లోని వార్డ్‌ కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్‌ పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అందించే సహాయ సహకారాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ శైలజ, డీపీఓ రత్నమాల, ఏఎంసీ వాసీపుద్దీన్‌, యూసీడీ యాదయ్య, స్వప్న, ఎన్‌.ప్రసాదరావు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

అదృశ్యమైన వ్యక్తి.. క్షేమంగా ఇంటికి

హయత్‌నగర్‌: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి క్షేమంగా తిరిగి వచ్చాడు. చేరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని భావించిన పోలీసులు.. తొలుత ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది ఇబ్రహింపట్నం చెరువులో గాలించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌ పోలీస్టేషన్‌ పరిధి తొర్రూర్‌ బాలాజీనగర్‌లో నివసించే బత్తుల మహేశ్‌(30) ప్రైవేటు ఉద్యోగి. శనివారం కుటుంబీకులు మందలించడంతో ఆత్మహత్య చేసుకోవాలని ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్దకు బైకుపై వెళ్లాడు. బైకు, హెల్మెట్‌, బ్యాగు, పర్సును కట్టపై ఉంచాడు. చెరువులో దూకేందుకు యత్నించగా.. నీటిని చూసి భయపడ్డాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లకుండా ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి, బెంగళూరు బస్సెక్కి వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన యువకుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు ఆదివారం హయత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మహేశ్‌ కోసం గాలింపు చేపట్టారు. పట్నం చెరువు కట్టపై ఆయనకు చెందిన బైకు, ఇతర వస్తువులను గుర్తించిన పోలీసులు.. మహేశ్‌ ఆత్మహత్య చేసుకున్నట్లు తొలుత భావించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది చెరువులో గాలించారు. ఈ క్రమంలో యువకుడి ఫోన్‌ ఆన్‌ ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. యువకుడి ఫోన్‌కు వాట్సాప్‌ మెసేజ్‌ పెట్టారు. తిరిగి ఆ వ్యక్తి పోలీసుల మెసేజ్‌ చేయడంతో.. వ్యక్తి రాయచూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల చొరవతో సోమవారం మహేశ్‌ హయత్‌నగర్‌ ఠాణాకు వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు యువకుడికి కౌన్సెలింగ్‌ ఇచ్చి, కుటుంబీకులకు అప్పగించారు.

ఓయూ భూములను పరిరక్షించండి

హబ్సిగూడ: ఓయూ భూములను పరిరక్షించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వీసీ ప్రొఫెసర్‌ కుమార్‌ను సోమవారం కోరారు. హబ్సిగూడ రవీంద్రనగర్‌ కాలనీలో ఓయూకు చెందిన సుమారు రూ.10 కోట్ల విలువైన 1000 గజాల స్థలంలో బయటి వ్యక్తులు బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ఓయూ లీగల్‌సెల్‌ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. కబ్జాలకు గురైన భూములను గుర్తించి పరిరక్షించాలని వీసీని కోరామన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్‌ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

కంచన్‌బాగ్‌, రాజనర్సింహా నగర్‌ కాలనీ, గౌస్‌నగర్‌, ఇందిరా నగర్‌, రియాసత్‌ నగర్‌, గులాం ముస్తాఫా నగర్‌, ఒవైసీ గ్రౌండ్‌, రాయల్‌–సీ హోటల్‌, మిధాన డిపో, హయాత్‌ హోటల్‌, ఫిసల్‌బండ రోడ్‌ పరిసర ప్రాంతాలు

మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు..

ఎస్‌బీహెచ్‌ ఆఫీసర్స్‌ కాలనీ, ఇందిరానగర్‌, డీబీఆర్‌ డయాగ్నస్టిక్‌ సెంటర్‌, ఎస్‌ఆర్‌ఎం కాలేజ్‌ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్‌ డిపో, లక్ష్మీ మోటార్స్‌, రెమాండ్స్‌ షోరూం, విజయ డయాగ్నస్టిక్‌ సెంటర్‌, మారుతీ మందిర్‌, దిల్‌సుఖ్‌నగర్‌ మెయిన్‌రోడ్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్‌ రూ.28, దొండ రూ.42, ఆలుగడ్డ రూ.27, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్‌ రూ.23, కీర రూ.35, బీన్స్‌ రూ.40, క్యాప్సికమ్‌ రూ.40. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నియామకం



కిరణ్‌యాదవ్‌

మలక్‌పేట: బీజేపీ అక్బర్‌ బాగ్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా బి.కిరణ్‌యాదవ్‌ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌యాదవ్‌ మాట్లాడుతూ.. అక్బర్‌బాగ్‌లో పార్టీని పటిష్టం చేయడానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న శ్రీనివాస్‌

దిల్‌సుఖ్‌నగర్‌: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు, కుర్తాళ శ్రీ సిద్దేశ్వరీ పీఠం తెలంగాణ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌కు డాక్టరేట్‌ వరించింది. మధ్యప్రదేశ్‌ ఇండోర్‌లోని మా భువనేశ్వరి ఇంటర్నేషనల్‌ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్‌ అందుకున్నారు. గత 2 దశాబ్దాలుగా శ్రీనివాస్‌ చేస్తున్న అన్నదాన, ఆధ్యాత్మిక, ఉచిత వివాహ సేవలను గుర్తించి డాక్టరేట్‌ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

అర్హులందరికీ రేషన్‌ కార్డులివ్వాలి

చాదర్‌ఘాట్‌: అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్‌ కార్డులు జారీ చేయాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు సతీష్‌సింగ్‌ సోమవారం డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌ మలక్‌పేటలో మూసీ పరీవాహక ప్రాంతంలో ఎక్కువ మంది నిరుపేదలు నివసిస్తున్నారని నియోజకవర్గంలోనే అత్యధిక రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి కుటుంబ సమగ్ర సర్వేలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రేషన్‌ కార్డులు జారీ చేయాలన్నారు.

మానవ హక్కుల ప్రత్యేకత అందరికి తెలియాలి



జస్టిస్‌ చంద్రయ్యను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

సైదాబాద్‌: ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ ఆర్గనైజేషన్‌ నూతన కార్యవర్గ సభ్యులను సంస్థ చైర్మన్‌ నేమ్‌సింగ్‌, సౌత్‌ చైర్మన్‌ సయ్యద్‌ కాజీమ్‌ అలీ హష్మీ ప్రకటించారు. రిటైర్డ్‌ జస్టిస్‌ చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల ప్రత్యేకత అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.